# అభివృద్ధిని చూసి ఆదరించాలి

- పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- బతుకమ్మ చీరలు, గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు పంపిణీ

ఆత్మకూరు, అక్టోబర్ 6: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ, గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, స్పోర్ట్స్ కిట్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్‌లతో కలిసి బతుకమ్మ చీరలతోపాటు అర్హులైన లబ్ధిదారులకు గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో అభివృద్ధి అంటే ఏంటో తెలియని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి మన కండ్ల ముందే కనిపిస్తుందన్నారు. కేసీఆర్ సంక్షేమ ఫలం అందని ఇళ్లంటూ లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మన ఇంట్లో మన కరెంట్ స్విచ్ మనమే బంద్ చేసుకున్నట్లు అవుతుందన్నారు. అన్ని మతాల పండుగలను గౌరవిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇచ్చి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాలవారీగా బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా 41కల్యాణలక్ష్మి, 10 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. 13 పంచాయతీలకు గానూ 14 క్రీడా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటేశ్వర్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ శివరంజని, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీ మొగిలి శ్రీధర్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, తాసీల్దార్ రాజు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు పాల్గొన్నారు.

### ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ తప్పకుండా అవుతుంది..

ఆత్మకూరు మండలం తప్పక రెవెన్యూ డివిజన్ అవుతుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. వారం రోజులుగా ఆత్మకూరును రెవెన్యూ డివిజన్ చేయాలంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన నేపథ్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు ఎమ్మెల్యే చిట్టెంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4న మక్తల్‌లో జరిగిన మంత్రి హరీశ్‌రావు సభలో డివిజన్‌పై చర్చించినట్లు, గతంలో ఇచ్చిన హామీని గుర్తుచేసినట్లు చెప్పారు. ఈమేరకు మంత్రి స్పందిస్తూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, త్వరలో పంపించి సీఎం కేసీఆర్ నోట తీపి కబురు వింటామన్నారు. అంతకుముందు ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో డివిజన్ ఏర్పాటు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరి ఆకాంక్ష మేరకు త్వరలో ఆత్మకూరు డివిజన్ అవుతుందని, ఎన్నికల తర్వాత జరిగే పునర్విభజనతో నియోజకవర్గం కూడా ఏర్పాటవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో సభ మొత్తంగా జై కేసీఆర్, జై రామన్న నినాదాలతో హోరెత్తింది.



అమరచింతలో గృహలక్ష్మి ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

### సంక్షేమ సర్కారుకు అండగా నిలవాలి

అమరచింత, అక్టోబర్ 6 : పుట్టినప్పటి నుంచి చివరి మజిలీ వరకు ఏదో ఒక విధంగా ప్రయోజనం కల్పించేలా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ సంక్షేమ సర్కారును మూడోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు అండగా నిలవాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో ఉన్న కేజీబీవీ పాఠశాలలో రూ.2.30కోట్లతో నిర్మిస్తున్న అదనపు గదులకు సర్పంచ్ బండి పావనీ వెంకట్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం అమరచింత మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఆడపడుచులు బతుకమ్మ చీరలను మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కౌన్సిలర్లుతో కలిసి పంపిణీ చేశారు. అదేవిధంగా పేదలకు సొంతింటి కలను నేరవేర్చేందుకు మొదటి విడుతలో మండలానికి మంజూరైన గృహలక్ష్మి పథక ప్రొసీడింగ్‌లను 630మంది లబ్ధిదారులకు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి పంపిణీ చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోని క్రీడాకారులకు ప్రభుత్వం అందించే క్రీడా సామగ్రిని ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో క్రీడాకారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ప్రతి ఇంట్లో మహిళలు సంతోషంగా ఉంటే ఆ కుటుంబమే ఆనందంగా ఉంటుందన్నారు. అందుకే సీఎం కేసీఆర్ ఏ సంక్షేమ పథకం మొదలుపెట్టిన మహిళల పేరు మీదనే ఉంటుందని, మహిళ లోకం బీఆర్‌ఎస్ సర్కారును మరోసారి ఆశీర్వదించి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ సింగ్, వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, తాసీల్దార్ షేక్‌చాంద్‌పాషా, కమిషనర్ మహ్మద్‌ఖాజా, ఎంపీడీవో జ్యోతిఫరూసీయా, కేజీబీవీ జీసీడీవో సుభాలక్ష్మి, ఎస్‌వో షబానాబేగం, ఎంఈవో భాస్కర్‌సింగ్ ఉన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక

## నియోజకవర్గ ఎల్లలు తెలియని నాయకుడు జీఎంఆర్

- జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట,అక్టోబర్ 6 : దేవరకద్ర నియోజకవర్గం ఎల్లలు తెలియని నాయకుడు జీఎంఆర్ అని, నియోజకవర్గం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నది ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అని ప్రజలకు తెలుసని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీవైస్ చైర్మన్‌తోపాటు ఎంపీపీ గుంతమౌనిక, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గిన్నె కొండారెడ్డి, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో చిన్న చింతకుంట మండంలోని కురుమూర్తి వద్ద రూ.45కోట్లతో బ్రిడ్జి, పామాపురం, అప్పరాల, పాత జంగమాయపల్లి బ్రిడ్జీలు నిర్మించారన్నారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్పా వారి సంక్షేమం కోసం పాటుపడలేదని ఎద్దేవా చేశారు, నియోజకవర్గంలో రెండు మైనార్టీ గురుకుల పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. జీఎంఆర్ స్థాయిని మించి మాట్లాడుతున్నారని, అతనికి సొంత ఊరిలోనే పట్టులేకపోవడం గత ఎన్నికల్లో సొంత పార్టీకి వెన్నుపోటు పొడిచి ఇతర పార్టీల నాయకులతో కుమ్మకైన సంగతి అందరికీ తెలుసన్నారు. నియోజకవర్గంలోని టికెట్ కోసం ముగ్గురు నాయకులు పోటీపడుతున్నారని ఎవరూ పోటీ చేసినా డిపాజిట్ దక్కిదని, ఎమ్మెల్యే ఆల లక్ష మెజార్టీతో గెలుపొందడం ఖామయన్నారు .మంత్రి హరీశ్‌రావు సభను చూసి కాంగ్రెస్ నాయకులకు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు.

### ఖబడ్దార్ జీఎంఆర్

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జీఎంఆర్ ఖబడ్దార్ అని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదగిరి యాదవ్ హెచ్చరించారు. జీఎంఆర్ కాంగ్రెస్ నుంచి టిక్కెట్ వస్తుందో రాదో అయోమయంలో ఉంటూ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారన్నారన్నారు. సమావేశంలో కౌన్సిలర్ పద్మాఅయ్యన్న, చీర్ల నాగన్న సాగర్, మార్కెట్ డైరెక్టర్లు బాలకృష్ణారెడ్డి, చాపల భాస్కర్, వెంకటన్న గౌడ్, పెంటన్నయాదవ్, భాస్కర్, కురుమూర్తి దేవస్థానం డైరెక్టర్ శంకర్‌యాదవ్, రాములుయాదవ్, శ్రీనూజీ, శ్రీను, వసీం పాల్గొన్నారు.

# ఆడపడుచులకు దసరా కానుకగా బతుకమ్మ చీర

- ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామమ్మ

చిన్నంబావి, అక్టోబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా ఆడపడుచులకు బతుకమ్మ చీరను అందిస్తుందని, అర్హులైన మహిళలు బతుకమ్మ చీరను తీసుకోవాలని ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పునూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బతుకమ్మ చీరలు, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అందించిన స్పోర్ట్స్ కిట్లను తాసీల్దార్ ఇక్బాల్, ఎంపీడీవో రవినారాయణతో కలిసి మహిళలు, క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంస్కృతీ,సంప్రదాయాలను సీఎం కేసీఆర్ గౌరవిస్తున్నారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని మతాల పండుగలకు ప్రా ధాన్యం ఇస్తూ దసరాకు బతుకమ్మ చీరలు, రంజాన్‌కు దుస్తు లు, క్రిస్మస్ కానుకలను అందజేస్తుందన్నారు. అదేవిధంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి క్రీడా సామగ్రిని అందజేస్తుందన్నారు. అందులో భాగంగానే క్రీడా సామగ్రిని అందజేశామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బగ్గారి నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ పుష్పలత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు తగరం లక్ష్మి, సర్పంచులు నంది కౌసల్య, గోవింద శ్రీధర్‌రెడ్డి, ఆర్‌ఐ రాములు, ఎంపీవో రామస్వామి, ఉప సర్పంచులు ఆనంద్‌యాదవ్, బీసన్న, బీఆర్‌ఎస్ నాయకులు చిన్నారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఉగ్ర నర్సింహ, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

### ఊరూరా బతుకమ్మ చీరల పంపిణీ

కొత్తకోట,అక్టోబర్ 6 : ఊరురా బతుకమ్మ చీరలను శుక్రవారం జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంతమౌనిక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ఆడపడుచుల కోసం పంపించిన బతుకమ్మ చీరలను దసరా పండుగకు కట్టుకోవాలని పంపిణీ చేశారు. అలాగే ఆయా గ్రామాల్లో సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను క్రీడాకారులకు అందజేశారు. రామకృష్ణాపురంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి,యుగంధర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల శ్రీను, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, జగన్మోహన్‌రెడ్డి, పద్మమ్మ, రామకృష్ణ, రవీందర్ గౌడ్, ఆంజనేయులు,మహేశ్ పాల్గొన్నారు.

### శ్రీరంగాపురం మండలంలో..

శ్రీరంగాపురం, అక్టోబర్ 6 : మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తుందని సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జానంపేటలో మహిళల కోసం పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరలను స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివ, కార్యదర్శి కార్తీక్, మహిళలు పాల్గొన్నారు.

### బతుకమ్మ చీరల పంపిణీ

వీపనగండ్ల, అక్టోబర్ 6: దసరా పండుగ కానుకగా తెలంగాణ ప్రభుత్వం అందజేసిన బతకమ్మ చీరలను మండలంలోని కల్వరాల గ్రామంలో సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, ఉపసర్పంచ్ మోహన్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు ఎండీ సర్దార్ శుక్రవారం మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కురుమయ్య, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

### టీ షర్టు, క్రీడా వస్తువులు అందజేత

పెద్దమందడి, అక్టోబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం యువకులు, విద్యార్థుల కోసం ఆట వస్తువులను, టీ షర్ట్‌లను అందజేసిందని అందులో భాగంగానే కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తు న్నామని సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా యువకులు సీఎం కేసీఆర్, మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొప్పునూరులో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు



నిర్విన్ లో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్, ఎంపీపీ



దొడగుంటపల్లిలో యువకులకు ఆట వస్తువులు, టీ షర్టులు పంపిణీ చేస్తున్న సర్పంచ్



కల్వరాలలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



జానంపేటలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి